RNI NO:APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

NAVATARAM TELUGU DAILY ఎడిటర్: శిరిగిరి వరదరాజు

పబ్లిష్: రాజమహేంద్రవరం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి సంపుటి:11 సంచిక: 357 బుధవారం, 04-02-2026 పేజీలు:4 వెల:1.00

## విశాఖ ఉక్కుకు పూర్తి సహకారం అందిస్తాం: సీఎం చంద్రబాబు



ఒకప్పుడు తీవ్ర నష్టాలతో మూసివేత అంచులకు చేరిన విశాఖ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) మళ్లీ లాభాల బాట పట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కేవలం ఏడాదిన్నర కాలంలోనే అనూహ్య ప్రగతి సాధించి, ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు సచివాలయంలో విశాఖ ఉక్కు పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులు ప్లాంట్ పనితీరును సీఎంకు వివరించారు. 2024-25 రెండో త్రైమాసికంలో రోజుకు కేవలం 9,215 టన్నులుగా ఉన్న ఉక్కు ఉత్పత్తి, ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తుండటంతో రోజుకు 19,401 టన్నులకు చేరిందని తెలిపారు. దీంతో ప్లాంట్ సామర్థ్య వినియోగం 45 శాతం నుంచి రికార్డు స్థాయిలో 94 శాతానికి పెరిగింది. ఈ ప్రగతి ఆర్థిక ఫలితాల్లోనూ స్పష్టంగా కనిపించింది. 2024 సెప్టెంబర్‌లో రూ.486 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన ఆర్ఐఎన్ఎల్, 2026 జనవరి నాటికి రూ.54 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.11,000 కోట్ల ఆర్థిక సహాయం ప్లాంట్‌ను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిందని, దీంతో సంస్థ క్రెడిట్ రేటింగ్ కూడా మెరుగుపడిందని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. యాజమాన్యం, కార్మికులు, ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేసి విశాఖ ఉక్కును మరింతగా విజయపథంలో నడపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీఎండీ మనీష్ రాజ్ గుప్తా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్థానిక పత్రికలకు అక్రిడిటేషన్లను నిలుపుదల చేయవద్దు

### వెరిఫికేషన్ పేరుతో వేధింపులు ఆపాలి

### ఐ & పిఆర్ డిడికి పలు జర్నలిస్టు సంఘాల వినతి



**నవతరం, విశాఖపట్నం**

సర్క్యులేషన్ 5వేలు దాటిన స్థానిక పత్రికలకు వెరిఫికేషన్(పరిశీలన) చేసిన తర్వాతే ప్రెస్ అక్రిడిటేషన్లను జారీ చేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని పలు జర్నలిస్టు సంఘాల నేతలు సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సదారావుకు వినతి పత్రం అందజేశారు. నగరంలోని జిల్లా పరిషత్ జంక్షన్‌లో గల ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి చర్చించారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ వెరిఫికేషన్ పేరుతో అక్రిడేషన్లు నిలుపుదల చేయటం లేదని విశాఖ జిల్లాలో ఈ రకమైన వేధింపులు తగవన్నారు. గత సారి, అంతకు ముందు ఇదే రకంగా వెరిఫికేషన్ చేశారని మరో సారి వెరిఫికేషన్ దేనికని ప్రశ్నించారు. నిబంధనలు చిన్న పేపర్లకేనా మిగతా వాటికి వర్తించవా అని ప్రశ్నించారు. 5వేలు దాటిన చిన్న పత్రికలను వెరిఫికేషన్ చేయాలనే విషయం జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీలో సమగ్రంగా చర్చించకుండా కమిటీ సభ్యులుగా ఉన్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టుల ఆమోదం లేకుండా వెరిఫికేషన్ తగదన్నారు. సమాచార శాఖ అధికారుల ఉద్దేశాలను కమిటీపై రుద్ద వద్దని హితవు పలి కారు. గత ప్రభుత్వం అక్రిడేషన్లు తగ్గించిందని తమ ప్రభుత్వం అక్రిడేషన్లు పెంచు తామని హామీ ఇచ్చి తీరా జీవో నెంబర్ 84 ద్వారా పెంచకపోగా తగ్గాయన్నారు. వాటిని కూడా లేకుండా చేయటం అన్యాయమని ఆయనకు తెలిపారు సర్క్యులేషన్ 5వేలు అయినా అంతకు మించినప్పటికీ వెరిఫికేషన్ ఆలోచనను వెనక్కి తీసుకుని రెగ్యులారిటీ కలిగిన పత్రికలకు ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ దృష్టిలో ఉంచి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిడిని కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు కె.రాము, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక యూనిట్ అధ్యక్షుడు కె.పరశురాం, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధి రవికుమార్, సీనియర్ జర్నలిస్టు హరినాథ్, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కదలి రాజేంద్రప్రసాద్, ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి ..

### విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి, అసలు వాస్తవాలను వెలికితీసేందుకు ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంగళవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సమర్పించిన నివేదిక, కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి అందిన సమాచారం మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నట్టు కేబినెట్ గుర్తించింది. సిట్ విచారణలో వెలుగు చూసిన కొన్ని కీలక అంశాలను ఛార్జ్‌షీట్‌లో ఎందుకు చేర్చలేదనే విషయంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మూడు అంశాల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి, అసలు సూత్రధారులను, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకే విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కమిషన్ ద్వారా తిరుమల లడ్డూ పవిత్రతపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విచారణ కమిషన్ నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని కేబినెట్ తెలిపింది.

## భారత్, అమెరికా మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం

### ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి: భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## విశాఖ రైల్వేస్టేషన్‌లో పాత నేరస్తుల్ని పట్టించిన రోబో పోలీస్

**నవతరం, విశాఖపట్నం**

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో భద్రతా విధుల్లో ఉన్న 'ఏఎస్‌సీ అర్జున్' అనే హ్యూమనాయిడ్ రోబో తన సత్తా చాటింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోబో, ఇద్దరు పాత నేరస్థులను గుర్తించి, వారిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం, సోమవారం రాత్రి 8.10 గంటల సమయంలో స్టేషన్ ప్రాంగణంలో 'అర్జున్' విధుల్లో ఉంది. అప్పటికే నేరస్థుల వివరాలు, ఫొటోలను రోబోలో అప్‌లోడ్ చేసి ఉంచారు.



స్టేషన్‌లో తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను రోబో తన కెమెరాతో చిత్రీకరించి, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా పాత నేరస్థులుగా గుర్తించింది. వెంటనే ఈ సమాచారాన్ని, సీసీటీవీ ఫుటేజీ వివరాలను కంట్రోల్ రూమ్‌కు పంపింది. రోబో నుంచి సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ బీఎస్. నారాయణ, ఎస్సై వి. కీర్తి రెడ్డి నేతృత్వంలోని బృందాన్ని అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి శివ, బంగారు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ప్రయాణ టికెట్లు కూడా లేవని గుర్తించారు. విచారణలో వీరిద్దరిపై రాయగడ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు తేలింది. దీంతో కేసు నమోదు చేసి, రాయగడ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా స్పందిస్తూ, పాత నేరస్థులను గుర్తించడంలో ఏఐ ఆధారిత రోబో సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో నేర నియంత్రణలో ఇలాంటి టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది.



ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

## సహనమే భారత్‌ను గెలిపించింది: మోదీ

విదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిర మైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొ న్నారు. అమెరికాతో చారిత్రా త్మక ట్రేడ్ డీల్ కుదిరిన సం దర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లా డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమ ర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టు ముట్టాయని గుర్తుచేసుకున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తు న్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్‌తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొంద న్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్ప టికీ.. భారత్ మాత్రం ప్రయో జనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ప్రజల ముంగిటకే రెవిన్యూ సేవలు

## పట్టాదారు పాసుపుస్తకాలు నేరుగా రైతులకే పంపిణీ
## జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



నవతరం, అనకాపల్లి (నక్కపల్లి)

రెవిన్యూ సేవలను ప్రజలముంగిటకే అందిస్తున్నామని, పట్టాదారు పాసుపుస్తకాలు నేరుగా రైతులకు గ్రామంలోనే పంపిణీ చేయటం జరుగుతుందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం నక్కపల్లి మండలం కాగిత గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలను జిల్లా కలెక్టరు రైతులకు నేరుగా రైతుల ఇళ్లకే తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గతంలో జిల్లాలో రీ సర్వే జరిగిన 373 గ్రామాలలో రైతులకి జారీ చేసిన 2,01,841 పట్టాదార్ పాస్ పుస్తకాల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వశీ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాసుపుస్తకములు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రీసర్వేలో రికార్డుల తప్పులను సరిచేసి శుద్ధ మైన రికార్డులతో, రైతులకు వారి భూములపై వివాదం లేని పూర్తి హక్కులు, భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు రూపొం దించి పంపిణీ చేస్తుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు కొరకు ప్రజలు ఎటువంటి రుసుములు చెల్లించనవసరం లేదని, తెలిపారు. రెవిన్యూ సేవలన్నింటిని గ్రామస్థాయి లోనే అందించడం జరుగుతుందన్నారు. అం తకుముందు నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఆర్డిఓ వివి రమణ ఇతర శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పునరావాస కాలనీలో నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఇంచార్జి తహసీల్దార్ మహేష్, ఉప తహసీల్దార్ నారాయణరావు, సర్పంచ్ రాజేష్, రైతులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్‌కు ఘన సన్మానం

నవతరం, విశాఖపట్నం (పశ్చిమ)



సింహాచలం డిపోలో శనివారం ఎస్.ఎ. స్వామి డ్రైవర్ ఉద్యోగ విర మణ కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు ప్రత్యేక ఆహ్వానితులుగా యచ్చు సి.శ్రీనివాస్, సిఐ రమణమూర్తి, నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ డిపో సెక్రెటరీ జెయస్న్.రాజు, ప్రెసిడెంట్ నాయుడు వర్కింగ్ ప్రెసిడెంట్ టిన్.రావు, ఎస్సీ అండ్ ఎస్టీ (2409/1990) అసోసియేషన్ సెక్రెటరీ ఎస్.గురవయ్య, ప్రెసిడెంట్ బి.ఎ.రావు, సీనియర్ నాయకులు ఏజీ మూర్తి, కనకయ్య, టైర్ ఎడీసి కెవి.రావు కేవస్పి రావు, పివి ప్రసాద్‌లతోపాటు బంధుమిత్రులు, ఎన్ఎంయు అసోసియేషన్ నుండి మహిలా సభ్యులు కూడా పాల్గొని ఘనంగా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వామి సేవలను అతిధులు అభినందించారు.

# వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం



నవతరం, చోడవరం

ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్. రాజు అన్నారు. మంగళవారం మండలంలోని జుత్తాడ గ్రామ సమీపంలో సూదికనుము వద్ద గోవాడ గ్రామ రైతాంగానికి శారదానది నుంచి సాగునీరు అందించే కాలువ మరమత్తు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ సాగునీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఎప్పటినుండో శారదా నది నుండి గోవాడ రైతులకు సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని దీంతో 4.50 లక్షలతో కాలువలో పూడిక తీతపనులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతామని తెలిపారు. సూదుకనుము వద్ద శారదా నదిలో గట్టు నిర్మాణానికి త్వరలో అంచనాలు తయారు చేయమని అధికారులను ఆదేశించామని, వెంటనే నిధులు మంజూరు చేయించి పనులు చేపడతామన్నారు. దానివల్ల సాగునీటి కాలువలకి సాగునీరు చేరుతుందని ఎప్పటినుండో రైతులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో గోవాడ మాజీ సర్పంచ్ యేడువాక లక్ష్మణకుమార్, పిఏసిఎస్ అధ్యక్షుడు యేడువాక అర్జునరావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు వేపాడ అచ్చిబాబు, సకురు కోటేశ్వరరావు, యేడువాక ఆనంద్, దేముడు, సురేష్, అట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

# అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

నవతరం, అనకాపల్లి



అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం కూడలి వద్ద అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ సుందరపు విజయ్ కుమార్ గారు. మంగళవారం సాయంత్రం అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీ సుందరపు విజయ్ కుమార్ గారు రోడ్డు నిర్మాణ కూలీలు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే గాజువాక రోడ్డులో రోడ్డుకిరువైపులా ఉన్న మాంసపు దుకాణాలతో పాటుగా ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగించే పలు దుకాణాలను తొలగించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అనంతరం రోడ్డు నిర్మాణ కూలీలతో మాట్లాడుతూ నిర్మాణ పనులలో పాల్గొనే వారంతా భద్రతను పాటించాలని, హెల్మెట్‌లు, మాస్కులు, గ్లౌజ్‌లు ధరించాలను సూచించారు. ట్రాఫికెకి ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ గారికి సూచించారు. నిర్మాణ పనులన్నింటిని స్వయంగా నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు.

# జర్నలిస్టుల బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే

## సమస్యలు పరిష్కారానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి
## ఫెడరేషన్ సభ్యత్వానికి భారీ స్పందన
## రేపు సాయంత్రం తొలి విడతముగింపు



నవతరం, విశాఖపట్నం

సమాజ ప్రగతిలో జర్నలిస్టులు పాత్ర అత్యంత కీలకమని కాబట్టి వారి సమస్యలు పరిష్కారం బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేనిని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ ఎ జె)ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు పేర్కొన్నారు.. మంగళవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో వర్కింగ్ జర్నలిస్టుల (ఫెడరేషన్) సభ్యత్వ నమోదు సందర్భంగా జరిగిన సమావేశంలోవీరు మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించిన అనేక అంశాలు కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇవన్నీ సకాలంలో పరిష్కారం కావాలంటే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.. ఇక ఫెడరేషన్ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తుందన్నారు. గత నెల 28న ప్రారంభమైన సభ్యత్వ నమోదుకు సంబంధించి మంగళవారం నాటికి 300 మంది దాటి జర్నలిస్టులు తమ సభ్యత్వ రెన్యువల్స్ పూర్తి చేసుకున్నార న్నారు. బుధవారం సాయంత్రం వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం జాబితాని సిద్ధంచేసి రాష్ట్ర కార్యవర్గానికి నివేదించడం జరుగుతుందన్నారు.. కాబట్టి తమ యూనియన్‌లో చేరాలనుకున్న జర్నలిస్టులు వెంటనే సభ్యత్వం నమోదు చేయించుకోవాలని కోరారు.. అయితే అటువంటి వారు వర్కింగ్ జర్నలిస్టులగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు... ఉపాధ్యక్షులు రామకృష్ణ.. పక్కి వేణుగోపాల్. బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్, రాజశేఖర్, బొబ్బర ప్రసాద్, ఎంవి రాజశేఖర్

# ఐఎఫ్ఆర్‌కు బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

నవతరం, విశాఖపట్నం

అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ)కు దేశ విదేశాల నుండి ఎంతోమంది అతిధులు వస్తారని అందుకు విశాఖ బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఫిబ్రవరి 15వ తేదీ నుండి జరుగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొరకు జీవీఎంసీ పనులపై ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాలను జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఒక పొర వేసిన బీటీ రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన నిర్వహించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు ఎంతోమంది దేశ విదేశాల నుండి అతిధులు వస్తారని అందుకు విశాఖ బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించామన్నారు. బీచ్ రోడ్డులో, బీచ్‌లో వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని, బీచ్ క్లీనింగ్ మిషన్ల సహాయంతో ఇసుకలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, రాత్రి పారిశుధ్య పనులపై నిత్య పర్యవేక్షణ జరపాలని ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. విద్యుత్ దీపాలు, సోలార్ లైటింగ్ అన్ని పూర్తిస్థాయిలో వెలిగేలా నిరంతర పర్యవేక్షణ జరుపుతూ తగిన చర్యలు చేపట్టాలని, ఫుట్ పాతులను మరమ్మతులు చేపట్టి పెయింటింగ్ పనులు, రోడ్డు మార్కింగ్ లు పూర్తి చేయడంతో పాటు సెంటర్ మీడియన్లను వ్యర్థాలు లేకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజా ఆరోగ్య విభాగం అధికారులు ఇంటర్నేషనల్ ఫీట్ రివ్యూ పూర్తయ్యేవరకు సంయుక్త కార్యాచరణ చేపట్టి సంబంధిత పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. విశాఖలో నిర్వహించే ఫ్లీట్ రివ్యూకు విశాఖ మ్యూజియమును అతిథులు, సందర్శకులు సందర్శిస్తారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు మ్యూజియంను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ప్రధాన వైద్యా ధికారి డాక్టర్ ఈఎన్వి.నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్ ఏడుకొండలు తిరుమలరావు, కార్య నిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, మురళీకృష్ణ, సహాయక వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నైతిక జీవనం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించవచ్చు: జైన ముని ఆదర్శ్ ఆచార్యజీ



నవతరం, విశాఖపట్నం

ప్రముఖ జైన పండితుడు, మేనేజ్‌మెంట్ నిపుణుడు మరియు ఎడ్యువర్సిటీ ఎడ్యుకేషన్ స్థాపకుడు డా.ముని ఆదర్శ్ ఆచార్యజీ ఈరోజు ఇక్కడ ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (IIAM)లో "మైండ్ మేనేజ్‌మెంట్ మరియు సచేతన జీవనంలిలి" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తన ప్రసంగంలో డా.ముని ఆదర్శ్ ఆచార్యజీ అంతర్గత నియంత్రణ, ఆత్మజ్ఞానం, నైతిక జీవనం సమర్థవంతమైన నాయకత్వానికి మరియు సమగ్ర విజయానికి పునాదులని వివరించారు. జైన తత్వ సూత్రాల ఆధారంగా, మైండ్ మేనేజ్‌మెంట్ మరియు సచేతన జీవనం ద్వారా ఒత్తిడిని అధిగమించడం, ఆలోచనల్లో స్పష్టతను పెంపొందించుకోవడం, క్లిష్టమైన ఆధునిక జీవితంలో లక్ష్యబద్ధమైన జీవనాన్ని నిర్మించుకోవడం ఎలా సాధ్యమో విశదీకరించారు. ఈ కార్యక్రమంలో IIAM చైర్మన్ డా.ఎస్.పి.రవీంద్ర, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, వైస్ చైర్మన్ డా.విజయరవీంద్ర, ఈక్యూ ఫర్ పీస్ వైస్-ప్రెసిడెంట్ డా.చల్లాకృష్ణవీర్ అభిషేక్, మరియు డాక్టర్ సరాబంది మాట్లాడారు. ఆధునిక విద్యా-మేనేజ్‌మెంట్‌లో ఆధ్యాత్మిక విలువలను సమన్వయం చేయడంలో డా.ముని ఆదర్శ్ ఆచార్యజీ చేసిన సేవలను వారు ప్రశంసించారు. యువత, వృత్తిపరుల మధ్య ఇలాంటి దృక్కోణాలు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డా. ముని ఆదర్శ్ ఆచార్యజీకి ఆధ్యాత్మిక మేనేజ్‌మెంట్, విద్య, సచేతన నాయకత్వ రంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను "స్పిరిచువల్ సైంటిస్ట్ అవార్డు" ప్రదానం చేశారు. ప్రాచీన జైన జ్ఞానాన్ని ఆధునిక సమాజానికి అన్వయించేలా ప్రాయోగిక రూపంలో అందిస్తున్నందుకు ఈ పురస్కారం ఆయనకు అందజేయబడింది. ఈ కార్యక్రమంలో శ్రీమతి సి.శ్రుతి సారణి మరియు డా. కృష్ణవీర్ అభిషేక్ రచించిన "జినేంద్ర రామాయణం" గ్రంథాన్ని డా.ముని ఆదర్శ్ ఆచార్యజీ ఆవిష్కరించారు. ఈ గ్రంథం రామాయణాన్ని జైన దృక్కోణంలో విశ్లేషిస్తూ, అహింస, కరుణ, ఆత్మనిగ్రహం, అంతర్గత జాగృతి వంటి విలువలను సాహిత్యాత్మకంగా ప్రతిపాదిస్తుంది. ఆధునిక సమాజంలో నైతిక-ఆధ్యాత్మిక విలువలను ప్రోత్సహించడమే ఈ రచన లక్ష్యమని రచయితలు తెలిపారు.

# రంగాతో అంబటికి పోలికా?

## వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం
## విఎంఆర్‌డిఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్

నవతరం, విశాఖపట్నం



వంగవీటి రంగా వంటి మహా నాయకుడితో అంబటి రాంబాబును పోల్చడం సిగ్గుచేటని విఎంఆర్‌డిఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేదల కోసం ప్రాణాలు అర్పించిన వంగవీటి రంగా స్థాయికి అంబటిని తీసుకురావడం వైసీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని రంగా వంటి నేతతో పోల్చడం అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు. వంగవీటి రంగా పేరు పలకడానికి కూడా అర్హత లేని వ్యక్తిని ఆయనతో సరిపోల్చడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. కాపులపై దాడులు అంటూ కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ కావాలనే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వంగవీటి రంగా, ముద్రగడ వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడటం సరికాదని స్పష్టం చేశారు. హింస, దాడులు వైసీపీ పాలనకు గుర్తులుగా మారాయని విమర్శించారు. తిరుపతి లడ్డూ విషయంలో నిజాలు వెలుగులోకి రావడంతో వాటిని ఎదుర్కోలేక కులాల ప్రస్తావన తెరపైకి తెస్తున్నారని అన్నారు. గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు భయం, అసహనంతో చేసిన ఆరోపణలేనని పేర్కొంటూ, వైసీపీ తన రాజకీయ పంథాను మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఒక ప్రకటన లో హెచ్చరించారు.

# పద్మనాభం మండల పార్టీ కార్యాలయంలో కమిటీల నియామకాన్ని పరిశీలించిన సిరమ్మ

నవతరం, పద్మనాభం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పద్మనాభం మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ గ్రామస్థాయి కమిటీల నియామకం మరియు డిజిటలైజేషన్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర(సిరమ్మ) హాజరై డిజిటలైజేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకమని, ప్రతి కార్యకర్త వివరాలను డిజిటలైజ్ చేయడం ద్వారా పార్టీ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల ఎంపీపీ కంటుభుక్త రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు 'చిన్న శ్రీను సోల్జర్స్ పాల్గొన్నారు.



# ఊరువాడ పండగ సందడి

నవతరం, చోడవరం



14 గ్రామాల్లో మంగళవారం ఒకేరోజు గ్రామదేవతల పండగలు నిర్వహించడంతో ఊరువాడ సందడి నెలకొంది ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మండలంలోని చోడవరం కోటవీధి పిఎస్ పేట రామజోగి పాలెం చాకుపల్లి కండం పాలెం ధర్నాలు గోవాడ గ్రామాలతో పాటు పరిసర మండలాల్లోని పోలేపల్లి మెట్టవారిపాలెం మరువాక మాటూరు తదితర గ్రామాల్లో పరదేశమ్మ బుర్రలమ్మ పైడిమాంబ అమ్మవార్లకు పండగ మహోత్సవాలను నిర్వహించడం తో ఆయా గ్రామాలతో పాటు మండలం అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది ప్రధానంగా మంగళవారం కావడంతో అమ్మ వార్లకు పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వ హించడం మహిళా భక్తులు ముడుపులు ముక్కలు చెల్లించేందుకు భారీ ఎత్తున బారులు తీరి మరి అమ్మవార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు తరలిరావడంతో భక్తజనంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. అలాగే గోవాడ పరదేశమ్మ పండ గను మూడు రోజులు పాటు గ్రామస్తులు భారీ ఎత్తున నిర్వహిం చుకుంటున్నారు. 14 గ్రామాల్లోనూ గ్రామ దేవతల పండగ సందర్భంగా స్నేహితులను బంధువులను ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తుంది ఈ నేపథ్యంలోనే ఇతర ప్రాంతాల నుండి మంగళవారం బంధు వర్గాలు పండగలకు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది ఏ గ్రామంలో చూసినా మహిళలు ఆయా దేవతలకు మొక్కులు తీర్చుకోవడం కనిపించింది అలాగే మొక్కబొళ్ళు చెల్లించేవారు కావిడలు చీర సారెలు పసుపు కుంకాలుతో వాయిద్యాలు నడుమ ప్రదర్శనగా ఆలయాలకు చేరుకుంటున్న సందర్భాలలో ఆయా గ్రామాలలో నూతన శోభ సంతరించుకుంది.





# రూ.55 లక్షలతో రైతు బజార్

**రూ.86 లక్షలతో డ్రెయిన్లు పనులకు శంకుస్థాపన**

**2027 గోదావరి పుష్కరాల నాటికి మౌలిక వసతుల పూర్తి**

**ధవళేశ్వరం అభివృద్ధికి రూ.6 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు**

**రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**



( నవతరం - రాజమహేంద్రవరం రూరల్ )

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నిబద్ధతతో పనిచేస్తోందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు. శానిటేషన్ , రహదారులు, డ్రెయిన్లు, మార్కెట్ వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం గ్రామంలో గవర్నమెంట్ హాస్పిటల్ ప్రక్కన రైతు బజార్ నిర్మాణానికి, అలాగే కొత్తపేట, కాటన్‌పేట ప్రాంతాలలో నూతన సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయా అభివృద్ధి పనులకు అధికారికంగా శంకుస్థాపనలు చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయడం జరుగు తుందన్నారు. ధవళేశ్వరం గ్రామస్థుల చిరకాల వాంఛ అయిన రైతు బజార్‌ను సాకారం చేయాలనే ఉద్దేశంతో గతంలో రూ.9 లక్షలతో పనులు ప్రారంభించినప్పటికీ, గత ప్రభుత్వం హయాంలో పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గుర్తు చేశారు. ప్రస్తుతం మరో రూ.46 లక్షలు మంజూరు చేసి, మొత్తం రూ.55 లక్షల వ్యయంతో రైతు బజార్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు వేసి, రైతులకు తోడ్పడే విధంగా కమర్షియల్‌తో పాటు రైతులకు కూడా షాపులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. త్వరలో అన్నా క్యాంటీన్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి పన్నుల చెల్లింపు ఎంతో కీలకమని, గ్రామ పంచాయతీలో సుమారు రూ.6 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. స్థానిక సంస్థల ఉద్యోగులు పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో జీతాల చెల్లింపులో ఇబ్బందులు ఎదురవుతాయని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నట్లు వివరించారు. రూరల్ నియోజకవర్గంలో మొత్తం సుమారు రూ.35 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. గ్రామంలో అంతర్గత డ్రెయిన్ల నిర్మాణానికి రూ.94 లక్షల గ్రాంట్ తీసుకువచ్చినట్లు, మరిన్ని గ్రాంట్లు తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హామీ ఇచ్చారు. ఆవ చానల్ ప్రధాన కాలువతో అనుసంధానం చేసే పనులు కోటిన్నర రూపాయలతో చేపడుతున్నామని, త్వరలో మరో కోటి రూపాయలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. డ్రెయిన్ల ద్వారా మురుగు నీరు గోదావరిలో బ్యారేజ్ తరువాత కలిసేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

2027 గోదావరి పుష్కరాల నాటికి కాలువలు, రహదారుల అభివృద్ధి పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, 300-400 కోట్ల రూపాయల ప్రాజెక్ట్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిని వెడల్పు చేసి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆక్రమణలు తొలగించడంలో అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. టిడ్కో గృహాల సమస్యలు సహా ఇతర సమస్యలను గుర్తించి సమర్థవంతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రూ.86 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, రూ.2.50 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు, రూ.55 లక్షలతో రైతు బజార్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. మార్కెట్ అభివృద్ధికి మరో కోటి రూపాయల ప్రతిపాదనపై గ్రామస్థులు, స్థానిక నాయకులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఆర్మ్ స్ట్రాంగ్, మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎం. సునీల్ వినయ్ , ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, ఎ.ఎం.సి వైస్ చైర్మన్ బోడపాటి గోపి, నియోజకవర్గ పరిశీలకులు డొక్కా నాథ్ బాబు, రాష్ట్ర రైతు నాయకులు అన్నదేవుల చంటి, పుక్కళ్ళ రాజు, అళ్ళ ఆనందరావు, యడ్ల మహేష్, భీరా ప్రకాష్, యడ్ల వెంకటేష్, ఒంటెద్దు స్వామి, సావాడ శ్రీనివాస్ రెడ్డి, పొన్నాల లక్ష్మి సంతోషి, షేక్ అమీనా బేగం, బొప్పన నాగేశ్వరరావు, బైరెత్తి సరోజినీ దేవి, వర్రె రాజేష్, సాజిత్, గ్రంధి వెంకయ్య, బండి గోపి, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు కృషితో 7 ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ నిధులు

( నవతరం - రావులపాలెం )



ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు కృషితో కొత్తపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శ్రీరామాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులు మంజూరయ్యాయి. మూడు మండలాల్లో మొత్తం 7 ఆలయాల నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరైనట్లు వెల్లడైంది. ఆత్రేయపురం మండలంలో వద్దిపర్రులో శ్రీ రామాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు, మెర్లపాలెంలో శ్రీ కోదండ రామాలయానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. రావులపాలెం మండలంలో గోపాలపురం శ్రీ రామాలయానికి రూ.10 లక్షలు, దేవరపల్లి (గెద్దం వారిపాలెం)లో శ్రీ రామాలయానికి రూ.10 లక్షలు, లక్ష్మీపోలవరం బీసీ కాలనీలో శ్రీ కోదండ రామాలయానికి రూ.15 లక్షలు కేటాయించారు. అలాగే కొత్తపేట మండలంలో గంటిలో శ్రీ రామాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు, మద్దెల మెరక గ్రామం ఎస్సీ కాలనీలో శ్రీ రామాలయానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో ఆలయాల నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టేందుకు అవకాశం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రభుత్వం, టీటీడీ సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## వీఆర్వో యార్లగడ్డ ఏలియాకు ఘన సన్మానం

(నవతరం- రావులపాలెం)

డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, రావులపాలెం మండలం రావులపాలెం గ్రామంలో సోమవారం పదవీ విరమణ చేసిన వీఆర్వో యార్లగడ్డ ఏలియాకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆజూస్ డైరెక్టర్ డాక్టర్ యార్లగడ్డ సురేష్ కుమార్



ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ ఏలియా మాట్లాడుతూ వీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఎటువంటి మచ్చ లేకుండా విధులు నిర్వర్తించానని, నిధుల నిర్వహణలో పూర్తి బాధ్యతతో వ్యవహరించానని తెలిపారు. పేదలు సహాయం కోరితే ఎప్పుడూ ఆశించకుండా సేవలు అందించానని, ఉద్యోగ విరమణ అనంతరం కూడా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆజూస్ ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ సురేష్ కుమార్, ప్రెసిడెంట్ పలివెల సాల్మన్ రాజు, జాయింట్ సెక్రెటరీ అయినవిల్లి విజయబాబు, దయాకర్ కొమ్మర, లక్ష్మణరావు, పనసయ్య, కొమ్మర రాజు, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడెల్లి సురేష్, కోనసీమ జిల్లా కోశాధికారి చంద్రమల్ల సుధాకర్ బాబు, యూటీఎఫ్ నాయకులు విజయభాస్కర్, వైఎస్ఆర్‌పీ నాయ కులు నేకూరి రాజేష్ కుమార్, చదలవాడ మసేన్, ఆజూస్ స్వచ్ఛంద సంస్థ సలహాదారులు కొల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ వ్యాఖ్యలు ద్వేషంతోనే

### కొత్తపేట టీడీపీ నేతల విమర్శ

( నవతరం- కొత్తపేట)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ద్వేషంతోనే ముద్రగడ పద్మనాభం లేఖలు రాస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతి అంశాన్ని కులం కోణంలో చిత్రీకరించడం ద్వారా కులవైషమ్యాలను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు దేశవ్యాప్తంగా సంపాదిస్తున్న ప్రతిష్టను చూసి అసూయతో ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ముద్రగడ పదేపదే లేఖలు రాస్తున్నారని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్ కుటుంబంపై అవమానకర వ్యాఖ్యలు జరిగినప్పుడు కులం గుర్తుకు రాని ముద్రగడ, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలపై వైసీపీ విమర్శలు చేసినప్పుడు కూడా స్పందించలేదని అన్నారు. రాజకీయ విమర్శలు రాజకీయాల వరకే పరిమితం చేయాలని, కులాన్ని అడ్డం పెట్టుకుని మాట్లాడటం మానుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కొత్తపేట నియోజకవర్గ టీడీపీ నేతలు కంఠంశెట్టి శ్రీనివాసరావు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు, బూత్ కన్వీనర్ ముద్రగడ ఫణి, నిమ్మకాయల చిన్నయ్య నాయుడు పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె..

**ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు పిలుపు**

**నవతరం, యలమంచిలి/అచ్యుతాపురం**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించ తల పెట్టిన సమ్మెలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సి.ఐ.టి.యు అచ్యుతాపురం మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు పిలుపునిచ్చారు.



మంగళవారం అచ్యుతాపురం మరియు హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక వైద్యాధికారులకు సమ్మె నోటీసుతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సమావేశంలో సోమునాయుడు మాట్లాడుతూ ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఎండగట్టారు. ఆశాలను కార్మి కులుగా గుర్తించి నెలకు 26,000 కనీస వేతనం చెల్లించాలనీ, పనివేళలను క్రమబద్ధీకరించి, అన్ని రకాల సెలవులు మరియు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలనీ, ఆరోగ్య రంగానికి దేశ జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని, ప్రతి ఆశా కార్యకర్తకు 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఏ.ఎన్.ఎం, జి.ఎన్.ఎం శిక్షణ పొందిన ఆశాలకు ప్రభుత్వ శాశ్వత పోస్టుల భర్తీలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మంగమ్మ, దుర్గ, సరోజినీ, సూర్యలక్ష్మి, భారతి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయడం ద్వారానే కార్మికుల హక్కులు కాపాడుకోగలమని నేతలు స్పష్టం చేశారు.

# కాపులను వంచించిన వైఎస్ జగన్..

**అలజడి సృష్టించే కుట్రలను తిప్పికొడతాం: మామిడి శివ అప్పారావు**




**నవతరం, అచ్యుతాపురం**

రాజకీయ లబ్ధి కోసం కాపు కులాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు మండిపడ్డారు. మంగళవారం అచ్యుతాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో కాపుల సహకారంతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి, గత ఐదేళ్లలో ఆ జాతిని పూర్తిగా ముంచేశారని శివ అప్పారావు ఆరోపించారు. చంద్రబాబు నాయుడు హయాంలో కాపులకు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్లను జగన్ తుంగలో తొక్కారని, ఇద్దరు ముగ్గురు నాయకులను కీలుబొమ్మలుగా చేసుకుని రాజకీయ పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. నేటితరం నాయకులు తప్పును ఖండించాలనీ, మాజీ మంత్రి హోదాలో ఉండి ముఖ్యమంత్రిని దుర్భాషలాడటం సంస్కారం కాదని, నాయకులు తప్పు చేస్తే దానిని రాజకీయంగా కులానికి, మతానికి ముడిపెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

# నడింపల్లిలో అట్టహాసంగా పైడితల్లి అమ్మవారి పండగ...

### పోటెత్తిన భక్తజనం..



**నవతరం, అచ్యుతాపురం**

మండలంలోని నడింపల్లి గ్రామ దేవత, ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఏటా మాఘ పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి మంగళవారం ఈ వేడుకను జరుపుకోవడం గ్రామ ఆనవాయితీ. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో మనోహరంగా అలంకరించారు. రాత్రివేళ విద్యుత్ కాంతులతో ఆలయ ప్రాంగణం మిరుమిట్లు గొలిపింది. తెల్లవారుజాము నుంచే అర్చకులు అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడింపల్లి గ్రామం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన అమ్మవారి 'అనుపు' ఉత్సవం గ్రామ వీధుల్లో అత్యంత కోలాహలంగా సాగింది. భజన బృందాల కీర్తనలు, కోలాటం, సాహసోపేతమైన కర్ర సాము ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళ వాయిద్యాల నడుమ ఘటాల ఊరేగింపు వైభవంగా జరిగింది. భారీ ఎత్తున మందుగుండు సామాగ్రిని కాల్చడంతో గ్రామ వీధులన్నీ పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. అమ్మవారి కృపకు అందరూ పాత్రులు కావాలని కోరుకుంటూ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## కాలుష్యం నుండి లంకెలపాలెం ప్రాంతాన్ని కాపాడండి

**నవతరం, పరవాడ**



బొగ్గు, ధూలు కాలుష్యం నుండి లంకెలపాలెం ప్రాంతాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం లంకెలపాలెంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈ విక్రమ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకి గ్రామస్తులు హిందూజా బొగ్గు లారీలు, ఎన్‌టి పిసి ధూళి లారీలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, బొగ్గు ధూలు లారీలపై కఠిన చర్యలు తీసు కోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాలుష్య సమస్యను పరిష్కరించడా నికి చర్యలు చేపడుతున్నట్లు మాని టరింగ్ టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. లంకెలపాలెం గ్రామ నాయకులు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, గంగరాజు, రమేష్, గోవిందా, మూర్తి, సిఐటియు నాయకులు గని శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లొల్ల గ్రామ చెట్టు - పట్టా లబ్ధిదారుల కొబ్బరి చెట్లకు రక్షణ కల్పించాలి



(నవతరం - ఆత్రేయపురం )

డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలోని ఇరిగేషన్ కాలువ గట్టుపై 1987-88 సంవత్సరంలో చెట్టు-పట్టా పథకం కింద దళిత లబ్ధిదారులకు మంజూరు చేసిన కొబ్బరి చెట్లకు తగిన రక్షణ కల్పించాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు తమ వివరాలను మంగళవారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రంలో సమర్పించారు. ప్రభుత్వం జీవనోపాధి కల్పన లక్ష్యంగా ఎనిమిది మంది దళిత లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 60 కొబ్బరి మొక్కల చొప్పున మంజూరు చేసిందని, ఈ మొక్కలు ద్వారానే తమ కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, ప్రస్తుతం వాటి సంరక్షణకు ప్రభుత్వ పరంగా చర్యలు అవసరమని లబ్ధిదారులు తెలిపారు. చెట్టు--పట్టా లబ్ధిదారులుగా దువ్వ స్వామయ్య, రాయి నాగేష్, గాలంకి నాగేశ్వరరావు, తానేటి అమృతరావు (మరణించారు) వారసుడు తానేటి విజయ మనోహర్, గాలంకి పేద సుబ్బారావు (మరణించారు) వారసురాలు గాలంకి నాగమణి, సవరపు యోసేబు, పసల కొండమ్మ, దిగుమర్తి మేరి ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన చెట్టు పట్టాల పరిరక్షణకు చర్యలు తీసుకుని, తమ జీవనాధారమైన కొబ్బరి చెట్లుకు భద్రత కల్పించాలని లబ్ధిదారులు అధికారులను కోరారు.

# పెద్దపులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందనక్కర్లేదు: మంత్రి కందుల దుర్గేష్

(నవతరం - రాజమహేంద్రవరం)

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలో పెద్ద పులి సంచారంపై ఆందోళన అక్కర్లేదని, పులిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ట్రాప్, డ్రోన్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు సూచించారు. మంగళవారం కేబినెట్ అనంతరం మంత్రి దుర్గేష్ ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారితో ఫోన్ లో మాట్లాడారు. పులి సంచారానికి సంబంధించిన తాజా సమాచారాన్ని అడిగి తెలుసుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. గత కొన్ని రోజులుగా తొర్రేడు, సీతానగరం సమీపంలో పులి సంచరిస్తుందని, దాని ఆనవాళ్లు గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని అధికారి చెప్పారన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒకసారి పులి సంచారం చేసిందని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. తగిన జాగ్రత్తలు తీసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అటవీ శాఖ పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఈ సందర్భంగా పెద్దపులి పట్టుబడేంత వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లొద్దని, రాత్రి సమయాల్లో పశువుల పాక చుట్టూ ఎక్కువ కాంతినిచ్చే దీపాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ తెలిపారు. త్వరితగతిన పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు మంత్రి దుర్గేష్



ప్రజలకు భరోసానిచ్చారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి

### పేద, మధ్య తరగతి వర్గాలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

### ఎమ్మెల్యే బండారు కృషితో నియోజవర్గానికి సీఎం రిలీఫ్ ఫండ్ అధికంగా వస్తుంది

### తెదేపా యువనాయకులు బండారు సంజీవ్

(నవతరం - రావులపాలెం)

ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అని, అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని యువ నాయకులు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని (చెక్కులు) యువనాయకుడు బండారు సంజీవ్ మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులందరికీ సీఎం సహాయ నిధి అందేలా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి చేస్తున్నారని తెలిపారు.



కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 14 మందికి రూ. 6,33,032ల విలువైన చెక్కులు, రావులపాలెం మండలానికి చెందిన 19 మందికి రూ. 7,48,365ల విలువైన చెక్కులు, కొత్తపేటకు చెందిన 11 మందికి రూ. 5,79, 508ల విలువైన చెక్కులు, ఆలమూరుకు చెందిన 13 మందికి రూ. 10,37, 024ల విలువైన చెక్కులు అందించారు. ఇందులో రీయింబర్స్మెంట్ చెక్కులు 55, ఎల్వోసీలు 2 కాగా మొత్తం 57 మందికి విలువైన చెక్కులు అందజేశారు.



# ఆలమూరు ఏటుగట్టుపై పేకాట రాయుళ్ల అరెస్ట్

### 11,320 నగదు స్వాధీనం: ఎస్ఐ జి.నరేష్

(నవతరం - ఆలమూరు)

డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజక వర్గం, ఆలమూరు, మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆలమూరు యానాం ఏటుగట్టు ప్రాంతంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న కొందరు వ్యక్తులు రహస్యంగా జూదం (పేకాట) ఆడుతున్నారని ఆలమూరు ఎస్ఐ జి.నరేష్‌కు నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఆ ప్రదేశంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకను గమనించిన జూదరులు పరారయ్యే ప్రయత్నం చేయగా, అప్రమత్తమైన పోలీసులు ఆరుగురు వ్యక్తులను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 11,320 నగదుతో పాటు పేకాట సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన ఆరుగురు నిందితులపై ఏపీ గేమింగ్ యాక్ట్ సెక్షన్ 9(1) కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ



మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా లేదా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా జూదం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక పనులు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# కొవ్వూరు నియోజక వర్గంలో పర్యాటక అభివృద్ధిపై సమగ్ర సమీక్ష

(నవతరం- కొవ్వూరు)

రాబోయే పుష్కరాలకు తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉండటంతో పర్యాటక అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత అధ్యక్షతన పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో జిల్లాలోని సహజ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, పర్యాటక రంగాన్ని ఆదాయ వనరుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. శాసన సభ్యులు సూచించిన మేరకు ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేసే అంశంపై ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే రాజమండ్రి తరహాలో వచ్చే పుష్కరాల సమయానికి కొవ్వూరు వైపు కూడా ఘాట్లను



పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించవలసి ఉందని తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రతిపాదిత పనులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని పర్యాటక శాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు, పర్యాటకులకు ఉపయోగపడే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన అన్నారు. విజ్జేశ్వరం నుంచి తాడిపూడి వరకు కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో గోదావరి పరివాహక ప్రాంతం విస్తృతంగా ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలి పారు. ఈ పనులకు సంబం ధించి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వారి సహ కారంతో అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషిచేస్తామని తెలిపారు. కుమార దేవరం - అరిక రేవుల మధ్య గోదావరిలో ఉన్న లంక ప్రాంతంలో కూడా పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ఆర్డీవో స్థాయిలో ప్రాథమిక ప్రతిపాదన సిద్ధం



చేశామని, వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి డీపీఆర్ సిఫారసు చేయడం జరుగుతుందని ఆయన వెల్లడిం చారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు ఎన్. వి. వి. ఎస్. మూర్తి ఆర్డీ, టూరిజం, పి. వెంకటాచలం జిల్లా పర్యాటక అధికారి, తూర్పు గోదావరి జిల్లా విజయ భాస్కర్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

# గాజువాక నియోజకవర్గ అభివృద్ధిపై క్షేత్రస్థాయి పర్యటన..

### వీఎంఆర్‌డీఏ కమిషనర్‌తో కలిసి ప్రాంతాలను పరిశీలించిన పల్లా శ్రీనివాసరావు

నవతరం, విశాఖపట్నం / గాజువాక

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు వీఎంఆర్‌డీఏ కమిషనర్ తో కలిసి గాజువాక నియోజక వర్గంలో ఈరోజు పర్యటిం చారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలను క్షేత్రస్థా యిలో పరిశీలించారు. ఈ సం దర్భంగా గాజువాక అభివృద్ధికి సంబంధించి ప్రతి పనిలో స్పష్టత, పారదర్శకత, కాలపరిమితి తప్పనిసరిగా ఉండాలని పల్లా శ్రీనివాసరావు గారు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి ఫలితాలు కనిపించాలంటే ప్రణాళికలతో పాటు కార్యాచరణ కూడా సమాంతరంగా సాగాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో పార్కింగ్, పిల్లల ఆటస్థలాల అభివృద్ధి విష యంలో తాత్కాలిక ఏర్పాట్లకు కాకుండా దీర్ఘ కాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. పిల్లల ఆటస్థలాల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, తక్కువ నాణ్యత గల భద్రతా నెట్‌లు లేదా సామగ్రి ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఆలయాల ముందు టైల్స్ ఏర్పాటు చేసే పనుల్లో కూడా ప్రజా ఉపయోగ ప్రమాణాలు తప్పనిసరిగా పాటిం చాలని సూచించారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటివరకు కాలపరిమితి, బడ్జెట్ అంశాల్లో స్పష్టత లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వుడా కాలనీ అసోసియేషన్ కేసు నేపథ్యంలో కళాక్షేత్రం లీజ్ అంశాన్ని సమీక్షిస్తూ, అడ్డదిడ్డంగా లీజులు ఇచ్చే విధా నాన్ని పూర్తిగా మానుకోవాలని పల్లా శ్రీని వాసరావు తెలిపారు. చట్టపరమైన పరిశీలన అనంతరం ఓపెన్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించడమే పారదర్శక మార్గమని అభిప్రాయపడ్డారు. లీగల్ ఓపీనియన్, ఆక్షన్ టైమ్‌లైన్‌ను త్వరగా ఖరారు చేయాలని అధికారులను కోరారు.

ఆదర్శ్ స్కూల్, స్టేడియం మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులపై జరిగిన చర్చల్లో కేవలం ప్రతిపాదనలకే పరిమితం కావడం పట్ల పల్లా గారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంత నిధులు అవసరం, ఏ శాఖ లేదా వనరుల ద్వారా సమకూరుస్తారు అనే అంశాలపై ముం దుగానే స్పష్టత ఉండాలని తెలిపారు. స్పష్టమైన కార్యాచరణ లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయ పరి సరాల అభివృద్ధి, రోడ్ల నిర్మాణాన్ని ప్రాధాన్యంగా చేపట్టాలని పల్లా



శ్రీనివాసరావు గారు సూచిం చారు. రోడ్లు ఏ విధంగా ఉండాలి, డ్రైనేజీ, లైటింగ్ వంటి అంశాలు ఎలా అమలు చేయాలి అనే విషయాల్లో సమగ్ర ప్రణాళిక రూపొందిం చాలని తెలిపారు. అమలు చేసే ఏజెన్సీని కూడా స్పష్టంగా నిర్ణయించాలని అధికారులను కోరారు. 1 టౌన్ నుంచి యారాడ బీచ్ వరకు రోడ్డు అభి వృద్ధి, అనుసంధాన బ్రిడ్జి ప్రతిపాదన గాజువాక పర్యాటకాభివృద్ధికి ఎంతో కీలకమని పల్లా శ్రీనివాసరావు గారు అభిప్రాయపడ్డారు. అయితే ఇది భారీవ్యయంతో కూడిన ప్రాజెక్ట్ కావడంతో సాధ్యతా అధ్యయనం, అలైన్‌మెంట్, డీపీఆర్ పూర్తయిన తర్వాతే ముందుకు వెళ్లాలని సూచిం చారు. ప్రతిపాదనలకే పరిమితం కాకుండా కార్యాచరణతో ముందుకు రావాలని అధికారు లను కోరారు. వీఎంఆర్‌డీఏ మీటింగ్ మిని ట్స్‌లో ఒక అంశం పూర్తిగా నమోదు కాకపోవ డాన్ని గమనించిన పల్లా శ్రీనివాసరావు గారు, అధికారిక రికార్డుల్లో ఇలాంటి లోపాలు ఉండ టం పరిపాలనా సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. వెంటనే స్పష్టత తీసుకురావాలని లేదా అజెండా అంశాలను సరిచేయాలని సూచించారు. మొత్తంగా అభివృద్ధి పనుల్లో ప్రకటనలకే పరి మితం కాకుండా, ప్రతి అంశానికి స్పష్టమైన నిర్ణయం, బాధ్యత వహించే అధికారి, కాలపరి మితి, బడ్జెట్ హెడ్ ఉండాలని పల్లా శ్రీనివాస రావు స్పష్టం చేశారు. గాజువాక ప్రజలకు అభి వృద్ధి ఫలితాలు ప్రత్యక్షంగా కనిపించాల్సిం దేనని, అందుకు అధికారుల సమన్వయంతో వేగంగా పనులు పూర్తి చేయాలని తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ యువతకు వ్యాపార, ఉపాధి అవకాశాలపై చర్చ

### భాగస్వామ్యమైన వివిధ విభాగాల అధికారులు

నవతరం, విశాఖపట్నం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎస్సీ, ఎస్టీ యువతను ఔత్సాహికులుగా తీర్చిదిద్దడంతో పాటు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునేలా అవగాహన కల్పించే ఉద్దేశంతో సంక్షేమ భవన్‌లో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించుకొని వివిధ అంశాలపై చర్చించుకున్నారు. జిల్లా మానిటరింగ్ కమిటీ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సామాజిక సంక్షేమ శాఖ, జిల్లా పరి శ్రమల కేంద్రం (DIC), APIIC, స్కిల్ డెవలప్‌మెంట్, DRDA, ఎస్సీ కార్పొరేషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (LDM--UCD), ఉపాధి కార్యాలయం, ఖాదీ & గ్రామీణ పరిశ్రమల బోర్డు (KVIB) తది తర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ వివిధ సం క్షేమ, ఆర్థిక సహాయ పథకాలు, రుణ సౌకర్యాలు, శిక్షణ కార్యక్రమాలపై వివరించి, ఎస్సీ, ఎస్టీ యువత స్వయం ఉపాధి ద్వారా ఆదాయాభివృద్ధి సాధించి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడానికి దోహదపడే అంశాలపై చర్చిం చారు. యువతలో వ్యాపార దృక్పథం పెంపొందించి, జిల్లాలో ఉపాధి అవకాశాల విస్తరణకు సమష్టి చర్యలు తీసుకోవాలని, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

Printed by SIRIGIRI VARADARAJU, and published by SIRIGIRI VARADARAJU, on behalf of SIRIGIRI VARADARAJU, and printed at : Krathi Publications, D.No.18-11-12/1, Krishna Nagar, ward-39, RAJAHMUNDRY, EAST GODAWARI DIST. ANDHRA PRADESH STATE - 533 101, Published at : Kranthi Publications, D.No. : 18-11-12/1, Krishna Nagar Ward-39, RAJAHMUNDRY, EAST GODAWARI DIST, ANDHRA PRADESH STATE - 533101, Editor : SIRIGIRI VARADARAJU, Email: navataramraju@gmail.com, Cell : 9959007255